క్లుప్తంగా

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో ...రూపాయల్లో) టమోటా 13, వంకాయ 23, బెండ 45, పచ్చిమిర్చి 45, కాకర 45, బీర 45, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజీ 12, క్యారెట్ 17. దొండ 35, ఆలు 18, ఉల్లి 14, గోకర 50, దోస 23, సొర 09, పొట్ల 15, అరటి 10, చిక్కుడు 65, అర్వి 55, మునగ 28, చిలగడదుంప 40, బీట్‌రూట్ 18, కీర 13, ఫ్రెంచ్ బీన్స్ 55, క్యాప్సికమ్ 47. గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

రంజాన్ కానుకల పంపిణీ



హస్తినాపురంలో రంజాన్ కానుకలు అందజేస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి వాటిని పకడ్బందీగా అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. డివిజన్ పరిధిలోని నందనవనం కాలనీలోని మసీదు ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 400 మంది ముస్లిం మహిళలకు రంజాన్ కానుకలను ఆమె అందజేశారు. కార్యక్రమంలో వార్డు కమిటీ మాజీ సభ్యులు సయ్యద్ పాషా, మజీద్ కమిటీ అధ్యక్షుడు జాకీర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో శోభాయాత్ర జరుపుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ పురుషోత్తంరెడ్డి

హస్తినాపురం: హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం నిర్వహించే శోభాయాత్రను ప్రశాంతవాతావరణంలో జరుపుకోవాలని వనస్థలిపురం డివిజన్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి అన్నారు. వనస్థలిపురం సీఐ జలేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి గణేశ్ టెంపుల్ సముదాయంలో ఏర్పాటు చేసిన శాంతికమిటీ సమావేశానికి ఏసీపీ పురుషోత్తంరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హనుమాన్ జయంతి శోభాయాత్రలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా మంచి వాతావరణంలో యాత్ర జరిగేందుకు ప్రజలు సహకారం అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బి.అశోక్‌కుమార్‌గౌడ్, ప్రభాకర్‌రావు, మిట్టా రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ తండాకు బీటీ రోడ్డు



మహేశ్వరం: నియోజకవర్గంలో ప్రతీ తండాకు బీటీ రోడ్డు వేస్తామని మంత్రి సబితారెడ్డి అన్నారు. చిన్న తూఫ్ర, పెద్దమ్మ తండాలకు రూ.3.48 కోట్ల నిధులు మంజూరు చేసినందుకు ఆయ తండా వాసులు బుధవారం మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ గిరిజన తండాకు బీటీ రోడ్డు నిర్మించి బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. నూతనంగా ఏర్పాటైన గ్రామ పంచాయతీలకు పంచాయతీ భవనాలను నిర్మాణం చేస్తామని.. ఇప్పటికే కొన్ని పంచాయతీలకు నిధులు మంజూరు చేశామన్నారు. బంజారా భవన్ నిర్మాణానికి రూ.2కోట్లు, గిరిజన తండాల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.9.41 కోట్ల నిధులను మంజూరు చేశామని వివరించారు. త్వరలో టెండర్లు పిలిచి పనులను ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంగోత్ రాజు నాయక్, పార్టీ సీనియర్ నాయకులు వాల్‌దాస్ సంతోశ్ గౌడ్, వాల్‌దాస్ రాఘవేందర్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అంజయ్య గౌడ్, విఠల్ నాయక్, రతన్ నాయక్, ఎస్.రవి నాయక్, బాబు, శంకర్, పాండు, రెడ్యా నాయక్, కిరణ్, రామ్మోహన్, సందీప్, రాములు తదితరులు పాల్గొన్నారు.

'మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం విఫలం'

కాచిగూడ: రాష్ట్రంలో మహిళలకు రక్షణ కల్పించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ మమతారాణి ఆరోపించారు. బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు దశరథలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన మహిళా మోర్చా కార్యవర్గ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళా మోర్చా ప్రతినిధులు పార్టీ గెలుపుకోసం ప్రతినిత్యం కృషి చేయాలన్నారు. మహిళా ప్రతినిధులు రుక్మిణి, మంజులారెడ్డి, తులసి, కంచన్, స్వప్న, కావేటి లక్ష్మి తదితరులున్నారు.

సర్వాంగ సుందరంగా హనుమాన్ ఆలయాలు

- రంగులు వేసి, పూలతోరణాలు, విద్యుద్దీపాలతో అలంకరణ
- నేటి జయంతి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి



ఆలయంలో కొలువుదీరిన స్వామివారు



విద్యుద్దీపాల అలంకరణలో సైదాబాద్ జైల్‌గార్డెన్‌లోని శ్రీప్రసన్నాంజనేయ స్వామి ఆలయం

సైదాబాద్: హనుమాన్ జయంతి వేడుకలకు సైదాబాద్, ఐఎస్‌సదన్ డివిజన్ల పరిధిలోని ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. సైదాబాద్ జైల్‌గార్డెన్‌లోని శ్రీప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆలయానికి కొత్త రంగులు వేయించి, పూలతోరణాలు, రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. గురువారం హనుమాన్ జయంతిని సందర్భంగా ఆలయంలో ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, శిఖరపూజ, ధ్వజారోహణం, ప్రసన్నాంజనేయ స్వామి వారికి వేదపఠనం, పంచామృతంతో భక్తుల స్వహస్తాలతో 108 కళశాలతో అభిషేకం నిర్వహిస్తారు. తదనంతరం స్వామి వారికి అలంకరణ, వడమాల పూజ, సహస్రనామార్చన జరిపిస్తారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాద వితరణ గావిస్తారు. సాయంత్రం భక్తుల భజనలు, కోలాటాలు, భాజా భజంత్రీలతో శ్రీప్రసన్నాంజనేయ స్వామి వారి రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

రాష్ట్రాన్ని అస్తిత్వ పర్చేందుకు బీజేపీ కుట్రలు

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆరోపణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్: రాష్ట్రాన్ని అస్తిత్వ పర్చేందుకు బీజేపీ కుట్రలు పన్నుతోందని, ప్రజలను ఆ పార్టీ తప్పుదోవ పట్టిస్తోందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం ఎమ్మెల్యే తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ, 10వ తరగతి పరీక్ష పత్రాల లీకేజీ వ్యవహారంలో నిందితుడు ప్రశాంత్ 2 గంటల్లో 12 ఫోన్‌కాల్స్ మాట్లాడినట్లు పోలీసులు గుర్తించారని అన్నారు. అతను ప్రస్తుతం ఆర్‌ఎస్‌ఎస్‌లో క్రియాశీలకంగా పనిచేస్తున్న బీజేపీ కార్యకర్త అని అన్నారు. బీజేపీ నాయకులు రాష్ట్రంలోని రైతులను, ఉద్యోగులను, విద్యార్థులను ఆగం చేయాలనుకుంటే కుదరలేదని, ఎమ్మెల్యేలను కొనుగోలు చేయాలని అనుకున్నా కుదరకపోవడంతో ఇప్పుడు విద్యార్థులు, నిరుద్యోగులపై పడ్డారన్నారు. బండి సంజయ్ అనుచరుడు రాజశేఖర్ తన మిత్రుడు ప్రవీణ్‌తో కలిసి టీఎస్‌పీఎస్సీ పేపర్‌ను లీక్ చేసి వాటిని ప్రభుత్వంపై మోపాలని చూశాడని ఆరోపించారు. టీఎస్‌పీఎస్ పేపర్ లీకేజీలో బండి హస్తం ఉందన్నారు. ఈ రోజు మరో అనుచరుడు 9.45 గంటలకు పదో తరగతి ప్రశ్న పత్రం ఫొటో తీసి 11.45 గంటలకు ఆ పత్రాని బండి సంజయ్‌కు పంపించాడన్నారు. జరుగుతున్న ఘటనల వెనుక బీజేపీ కార్యకర్తలు ఉండటం చూస్తే తెలంగాణ ప్రభుత్వాన్ని ఎలాగైనా నవ్వుల పాల్జేయాలని బీజేపీ కుట్రలు పన్నుతోందని స్పష్టమౌతోందన్నారు. తెలంగాణలో దేశంలో అన్ని రాష్ట్రల కంటే అత్యుత్తమైన పోలీస్ వ్యవస్థ ఉందని, అయినా బీజేపీ నాయకులు ప్రతి కేసును తమ అనుకూల సంస్థలైన ఈడీ, సీబీఐకి అప్పగించాలని డిమాండ్‌లు చేస్తున్నారని తెలిపారు. ఇదంతా తమ తప్పులను ఒప్పు చేసుకోవడానికే అని ప్రజలందరికీ స్పష్టమవుతోందన్నారు. ఇప్పటికైనా బీజేపీ తవ కుట్రలు మాని ప్రజలకోసం పని చేయాలని అప్పుడు నాలుగు ఓట్లు, రెండు సీట్లు వస్తాయన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ముద్రబోయిన శ్రీనివాస్ రావు, సామ తిరుమల్‌రెడ్డి, జిట్టా రాజశేఖర్‌రెడ్డి, భవాని ప్రవీణ్, కొప్పుల విఠల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో వసతుల కల్పనకు కృషి



శ్మశాన వాటికలో వసతులపై గ్రామస్తులతో చర్చిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: పెద్దచెరువు సమీపంలోని హిందూ శ్మశానవాటికలో అన్ని రకాల వసతుల కల్పనకు కృషి చేస్తానని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. మాజీ కౌన్సిలర్, కర్మన్‌ఘాట్ ఆంజనేయస్వామి ఆలయ చైర్మన్ పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, మన్సూరాబాద్ గ్రామస్తులతో కలిసి ఆయన బుధవారం శ్మశానవాటికను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, శ్మశానవాటికలో హ్యాండ్ పంపునకు బదులు పవర్‌బోర్ ఏర్పాటు చేయించామన్నారు. బర్నింగ్ షెడ్స్ చుట్టూ మొక్కలు నాటి సుందరీకరణకు చర్యలు తీసుకుంటామన్నారు. శ్మశాన వాటికలో దహన సంస్కారాలకు అధిక డబ్బులు వసూల్ చేయవద్దని కాటికాపరులకు సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు నాంపల్లి శంకరయ్య, యాదయ్య, మహేందర్, ఆనంద్, చంద్రమోహన్, వేములయ్యగౌడ్, శ్రీధర్‌గౌడ్, కాలనీలవాసులు ప్రదీప్‌కుమార్, యాదగిరి, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల నిరసన

ఎల్బీనగర్: పదో తరగతి పరీక్ష పేపర్ లీకేజీని నిరసిస్తూ పదో తరగతి బోర్డు ముందు ధర్నా చేస్తున్న యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరెస్టుకు నిరసనగా బుధవారం బీఎన్‌రెడ్డినగర్ చౌరస్తాలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ దిష్టి బొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి, మేరుగు రమేష్‌రెడ్డి, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి బీమిడి రామకృష్ణ, నాయకులు శశిధర్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, పార్వతి గణేష్‌రెడ్డి, శివ, దుర్గేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

దాహార్తి తీర్చేందుకే చలివేంద్రం

హుడాకాంప్లెక్స్: వేసవిలో బాటసారులకు దాహం తీర్చటం కోసం చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని బంగారు మైసమ్మతల్లి దేవసేన సమేత కాశీ వైద్యనాదేశ్వరస్వామి ఆలయ చైర్మన్ ఆకుల అరవింద్ అన్నారు. సాయి ఆధ్యాత్మిక గ్రంథ పారాయణం గ్రూప్ వారి సహకారంతో యాచకులకు బుధవారం మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు సాయికృష్ణ, సభ్యులు పద్మ, వీరమణి తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్ మేళాకు విశేష ఆదరణ



ఆలిండియా హ్యాండ్లూమ్ మేళాలో కొనుగోలుదారుల సందడి

వనస్థలిపురం: వనస్థలిపురం గణేష్ ఆలయ సమీపంలోని హుడా ఓపెన్ ఆడిటోరియం గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆలిండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళాకు స్థానికుల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. మేళాలో కొలువైన దుస్తులు, ఇతర ఉత్పత్తుల కొనుగోలుకు స్థానికులు ఆసక్తి చూపిస్తున్నారు. మేళాలో కొలువైన మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, డిజైనర్, భాగల్‌పూర్, కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్, లినెన్, కలంకారి, బెంగాల్ కాటన్, లక్నో చికాన్, బనారస్ చీరలు, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ, జైపూర్ బెడ్ షీట్స్, కొండపల్లి బొమ్మలు, బ్యాగులు, గాజులు తదితర ఉత్పత్తులు తగ్గింపు ధరలకు లభిస్తాయని నిర్వాహకులు అక్బర్ అలీ తెలిపారు. ఈ అవకాశం కొద్ది రోజులు మాత్రమే ఉంటుందన్నారు.

మూగ, చెవిటి యువతి సఖీ సెంటర్‌కు తరలింపు



గుర్తుతెలియని యువతి

హస్తినాపురం: గుర్తు తెలియని మూగ, చెవిటి యువతిని వనస్థలిపురం పోలీసులు గుర్తించి స్థానికంగా ఉన్న సఖీ సెంటర్‌లో చేర్పించారు. సీఐ జలేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని వైదేహినగర్ బస్టాప్‌లో మంగళవారం ఓ యువతి తచ్చాడుతుండగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి ఆ యువతిని అదుపులోకి విచారించగా ఆమెకు మాటలు రావని, మూగ, చెవిటి యువతి అని తెలిసింది. ఆమె ముస్లింగా గుర్తించామని, ఎవరైనా బంధువులు , స్నేహితులు, తెలిసిన వారు ఉంటే వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ జలేందర్‌రెడ్డి సూచించారు.

ప్రభుత్వ తప్పులను ప్రశ్నిస్తే అరెస్టులా?



మూసారంబాగ్ చౌరస్తాలో నల్లబ్యాడ్జీ ధరించి నిరసస తెలియజేస్తున్న బీజేపీ నాయకులు

మన్సూరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న తప్పులను ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం సిగ్గుచేటని జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ అరెస్టు నేపథ్యంలో పోలీసులు నర్సింహారెడ్డిని బుధవారం ముందస్తుగా హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో వరుసగా పరీక్ష పత్రాలు లీకేజీ అవుతున్న నేపథ్యంలో ప్రశ్నిస్తున్న బండి సంజయ్‌ను అరెస్టు చేయటం అక్రమం అని, సీఎం కేసీఆర్ తగిన మూల్యం చెల్లించకతప్పదని మండిపడ్డారు.

ప్రజలు అన్నీ గమనిస్తున్నారు...

నాగోలు: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అరెస్టును నిరసిస్తూ బుధవారం నాగోలులో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం కార్పొరేటర్ చింతల అరుణ-సురేంద్రనాథ్ యాదవ్‌ను పోలీసులు అరెస్టు చేసి చైతన్యపురి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని బండి సంజయ్‌ను వేధిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, బీఆర్ఎస్ పార్టీకి కాలం చెల్లిందన్నారు

నల్ల బ్యాడ్జీలతో నిరసన..

మలక్‌పేట: బండి సంజయ్ అరెస్టుకు ఖండిస్తూ బుధవారం మూసారంబాగ్ చౌరస్తాలో మలక్‌పేట బీజేపీ నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ దిష్టి బొమ్మ దహనం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందడి సురేందర్‌రెడ్డి, బొక్క మధుసూదన్‌రెడ్డి, గౌర దేవేందర్, రమేష్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సుభాష్‌చందర్, సురేందర్, జక్కా మోహన్‌రెడ్డి, దినేష్, సదానంద్, కోళ్ల గోపి, రాజేష్, ఉన్నారు.

రాష్ట్రంలో హేయమైన పాలన..

సైదాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ పోలీసులను పావులుగా ఉపయోగించుకుంటూ రాష్ట్రంలో హేయమైన పాలన సాగిస్తున్నాడని బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి విమర్శించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అరెస్టును నిరసిస్తూ బుధవారం సింగరేణికాలనీ చౌరస్తాలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేసారు.

వ్యవస్థలను భ్రష్టు పట్టించారు

మలక్‌పేట: బండి సంజయ్ అరెస్ట్ నేపథ్యంలో ముందస్తుగా కార్పొరేటర్ భాగ్యలక్ష్మిని మలక్‌పేట పోలీసులు కృష్ణతులసినగర్‌లో హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలో దుర్మార్గ పాలన నడుస్తోందని, అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించారని ఆరోపించారు.

ప్రజల దృష్టి మళ్లించేందుకే...

చంచల్‌గూడ: కూతురు లిక్కర్ స్కామ్, కొడుకు పేపర్ స్కామ్‌ల నుంచి ప్రజల దృష్టి మరల్చడానికి సీఎం కేసీఆర్ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాడని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు సహదేవ్‌యాదవ్ ఆరోపించారు. బండి సంజయ్ అరెస్టును నిరసిస్తూ బుధవారం కుర్మగూడ, సైదాబాద్ మెయిన్‌రోడ్డుపై ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. కుర్మగూడ డివిజన్ అధ్యక్షుడు బండ వెంకట్‌రెడ్డి, నాయకులు శ్రీనాథ్, జనాపాల మధు, మోహన్‌కృష్ణ, ప్రేమ్, గౌతమ్, యోగి, అజయ్, ప్రమోద్, శివ తదితరులున్నారు.



నాగోలులో సీఎం దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న బీజేపీ నాయకులు



కార్పొరేటర్ నర్సింహారెడ్డిని హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

ఆర్యవైశ్య సంఘ ప్రతినిధుల ఏకగ్రీవ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన సభ్యులతో లక్ష్మీనారాయణ

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ఆర్యవైశ్య సంఘ ప్రతినిధుల ఎన్నిక బుధవారం డివిజన్ పరిధిలోని ఎస్ విలేజి కన్వెన్షన్ హాల్‌లో సంఘ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ సమక్షంలో ఏకగ్రీవంగా జరిగింది. కర్మన్‌ఘాట్ సంఘ అధ్యక్షుడిగా అనంత రవిగుప్తా, ప్రధాన కార్యదర్శి ఆకుల రమాకాంత్‌లను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన సభ్యులను లక్ష్మీనారాయణ శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు తాడేపల్లి వెంకటేష్ గుప్తా, కోశాధికారి బిల్లకంటి కిరణ్‌కుమార్ గుప్తా, సభ్యులు ఆలంపల్లి శ్రీనివాస్ గుప్తా, చింతల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేఆర్ సేవలు చిరస్మరణీయం



ఎల్బీనగర్ రింగ్‌రోడ్డులో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



బీజేఆర్ భవనంలో.. కాంగ్రెస్ పార్టీ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి తదితరులు

ఎల్బీనగర్/మలక్‌పేట జోన్ బృందం: మాజీ ఉప ప్రధాని, సామాజిక సంస్కర్త బాబూ జగ్జీవన్ రామ్ (బీజేఆర్) జయంతి వేడుకలను బుధవారం ఎల్బీనగర్,మలక్‌పేట జోన్ల పరిధిలో ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, దళిత సంఘాల ప్రతినిధులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి బీజేఆర్ ఎంతో కృషి చేశారని, ఆయన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఎల్బీనగర్ రింగ్‌రోడ్డులోని జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, బీజేపీ రంగారెడ్డి అర్బన్‌జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎల్బీనగర్ ఇన్‌చార్జులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, మల్‌రెడ్డి రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జీహెచ్‌ఎంసీ ఫ్లోర్‌లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్‌రెడ్డి, ముద్రబోయిన శ్రీనివాసరావు, ముద్దగౌని లక్ష్మీప్రసన్నగౌడ్, బీఆర్ఎస్ ఎల్బీనగర్ ఎస్సీసెల్ చైర్మన్ జోగు రాములు, వైఎస్సార్‌టీపీ ఎల్బీనగర్ కన్వీనర్ మామిడి రాంచందర్, దళిత, యువజన సంఘాల నేతలు నివాళులర్పించారు.



ఎల్బీనగర్ రింగ్‌రోడ్డులో.. బీజేపీ రంగారెడ్డి అర్బన్‌జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి



బీఎన్‌రెడ్డినగర్‌లో.. కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి



ఎల్బీనగర్ రింగ్‌రోడ్డులో .. మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి



ఎల్బీనగర్ రింగ్‌రోడ్డులో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి



మూసారాంబాగ్ చౌరస్తాలో... మేడి పాపయ్య తదితరులు



ఐఎస్ సదన్‌లో.. కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి



సైదాబాద్‌లో .. బీఆర్ఎస్ అధ్యక్షుడు పగిళ్ల శ్రీనివాసరెడ్డి తదితరులు



మూసారంబాగ్‌లో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి



నివాళులర్పిస్తున్న బీజేపీ ఓబీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి లింగాల హరిగౌడ్, తదితరులు